ముంబై దూకుడు

చెన్నైకి ఆరో పరాభవం ● రోహిత్, సూర్య మెరుపులు ● దూబే, జడ్డూ పోరాటం వృథా

రోహిత్ (76*)

ముంబై: సీజన్ ఆరంభంలో తడబడ్డ ముంబై ఇండియన్స్ ఐపీఎల్-18లో వరుస విజయాలతో హ్యాట్రిక్ కొట్టింది. ఢిల్లీ, హైదరాబాద్‌పై ఇచ్చిన విజయాల ఊపులో ఉన్న హార్దిక్ పాండ్యా సేన.. వాంఖడేలో ఆదివారం చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే)తో జరిగిన పోరులోనూ గెలిచి ప్రత్యర్థి జట్లకు భారీ హెచ్చరికలు పంపింది. ఈ సీజన్‌లో వరుసగా విఫలమవుతున్న రోహిత్ శర్మ.. (45 బంతుల్లో 76 నాటౌట్, 4 ఫోర్లు, 6 సిక్సర్లు) మరో మ్యాచ్ విన్నింగ్ ఇన్నింగ్స్‌తో కదం తొక్కగా.. సూర్యకుమార్ యాదవ్ (30 బంతుల్లో 68 నాటౌట్, 6 ఫోర్లు, 5 సిక్సర్లు) మెరుపులతో చెన్నై నిర్దేశించిన 177 పరుగుల ఛేదనను ముంబై 15.4 ఓవర్లలోనే దంచేసింది. మొదట బ్యాటింగ్ చేసిన చెన్నై.. రవీంద్ర జడేజా (35 బంతుల్లో 53 నాటౌట్, 4 ఫోర్లు, 2 సిక్సర్లు), శివమ్ దూబే (32 బంతుల్లో 50, 2 ఫోర్లు, 4 సిక్సర్లు) రాణించడంతో 20 ఓవర్లకు 176/5 స్కోరుచేసింది. ఈ విజయంతో సీజన్ రెండో ఎల్‌క్లాసికో (ముంబై, చెన్నై మ్యాచ్‌ను అభిమానులు ఇలా పిలుచుకుంటారు)ను గెలుచుకున్న ముంబై.. తొలి మ్యాచ్‌లో ఎదురైన పరాభవానికి బదులు తీర్చుకున్నట్లైంది. రోహిత్‌కు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు దక్కింది.

రో'హిట్' జోరు

ఈ మ్యాచ్‌లో ముంబైకి విజయంతో పాటు రోహిత్ ఫామ్‌లోకి రావడం బోనస్‌గా దక్కింది. ఈ సీజన్‌లో ఇంపాక్ట్ ప్లేయర్‌గా బరిలోకి దిగుతూ వరుసగా విఫలమవుతున్న హిట్‌మ్యాన్.. కీలక మ్యాచ్‌లో జూలు విదిల్చాడు. అచ్చొచ్చిన వాంఖడేలో తనదైన ట్రేడ్ మార్క్ సిక్సర్లతో అభిమానుల కరువు తీర్చడంతో పాటు తనపై వస్తున్న విమర్శలకూ దీటుగా సమాధానమిచ్చాడు. ఓవర్టన్ రెండో ఓవర్లో బ్యాక్‌వర్డ్ స్క్వేర్ లెగ్ మీదుగా సిక్సర్‌తో మొదలైన రోహిత్ దూకుడు.. ఇన్నింగ్స్ ఆసాంతం కొనసాగింది. ఖలీల్ బౌలింగ్‌లోనూ హిట్‌మ్యాన్ 6, 4, 4 బాదాడు. రికెల్టన్ (24)ను ఔట్ చేసినా చెన్నైకి ఆ ఆనందం ఎక్కువసేపు నిలువలేదు. సూర్య రాకతో అగ్నికి వాయువు తోడైనట్లైంది. ఇద్దరూ చెన్నై బౌలర్లపై వంతులు వేసుకుంటూ విరుచుకుపడ్డారు. 33 బంతుల్లో రోహిత్ ఫిఫ్టీ పూర్తయింది. నూర్ అహ్మద్ బౌలింగ్‌లో హ్యాట్రిక్ బౌండరీలు కొట్టిన సూర్య.. 26 బంతుల్లో హాఫ్ సెంచరీ సాధించాడు. పతిరాన 16వ ఓవర్లో రోహిత్ ఓ సిక్స్ కొట్టగా సూర్య రెండు సిక్సర్లతో లాంఛనాన్ని పూర్తిచేశాడు. ఈ సీజన్‌లో ఆడిన 8 మ్యాచ్‌లకు గాను చెన్నైకి ఇది ఆరో ఓటమి.

సూర్య (68*)

సంక్షిప్త స్కోర్లు

చెన్నై: 20 ఓవర్లలో 176/5 (జడేజా 53*, దూబె 50, బుమ్రా 2/25, శాంట్నర్ 1/14); **ముంబై:** 15.4 ఓవర్లలో 177/1 (రోహిత్ 76*, సూర్య 68*, జడేజా 1/28)

అర్జున్‌కు రజతం

లిమా (పెరు): భారత యువ షూటర్ అర్జున్ బబుతా ఐఎస్ఎస్ఎఫ్ షూటింగ్ ప్రపంచకప్‌లో రజతంతో మెరిశాడు. పది మీటర్ల ఎయిర్ రైఫిల్ ఈవెంట్‌లో భాగంగా హోరాహోరీగా జరిగిన ఫైనల్‌లో అర్జున్.. 252.3 పాయింట్లు స్కోరు చేసి రెండో స్థానంలో నిలిచాడు. స్వర్ణం గెలిచిన చైనా షూటర్ షెంగ్ లిహావో (252.4)తో కేవలం 0.1 పాయింట్ల తేడాతో అర్జున్ పసిడి కోల్పోవాల్సి వచ్చింది.

భారత్ శుభారంభం

అమ్మన్ (జోర్డాన్): ఆసియా అండర్-15, అండర్-17 పురుషుల బాక్సింగ్ చాంపియన్‌షిప్స్‌లో తొలి రోజు భారత్ శుభారంభం చేసింది. 43 కిలోల విభాగంలో హార్దిక్.. 5-0తో కుబానిచ్‌బెక్ బొలుషో (కిర్గిస్థాన్)ను ఓడించాడు. 46 కిలోల కేటగిరీలో రుద్రాక్ష్.. 5-0తో ఇబ్రభీమ్ (మంగోలియా)ను చిత్తు చేశాడు.

బెంగళూరు బద్లా

పంజాబ్‌పై సునాయాస విజయం ● బ్యాటింగ్ వైఫల్యంతో కింగ్స్ ఓటమి ● కోహ్లీ, పడిక్కల్ అర్ధ శతకాలు

ముల్లాన్‌పూర్: సొంత వేదిక (చిన్నస్వామి)లో తడబడుతూ హ్యాట్రిక్ ఓటములు ఎదుర్కొన్న రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) ప్రత్యర్థుల గడ్డ మీద మాత్రం దుమ్మురేపుతున్నది. మూడు రోజుల క్రితమే బెంగళూరులో పంజాబ్ కింగ్స్ చేతిలో ఎదురైన పరాభవానికి దీటుగా బదులు తీర్చుకుంటూ.. ముల్లాన్‌పూర్‌లో శ్రేయస్ సేనపై 7 వికెట్ల తేడాతో సునాయస విజయం సాధించింది. మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన కింగ్స్.. తడబాటుకు గురై నిర్ణీత ఓవర్లలో 157/6 పరుగులే చేయగలిగింది. ప్రభ్‌సిమ్రన్ (17 బంతుల్లో 33, 5 ఫోర్లు, 1 సిక్స్) టాప్‌స్కోరర్ కాగా శశాంక్ (31 నాటౌట్) ఫర్వాలేదనిపించాడు. ఆర్‌సీబీ బౌలర్లలో కృనాల్ (2/25), సుయాశ్ (2/26) ప్రత్యర్థిని కట్టడిచేశారు. ఛేదనలో మొనగాడు విరాట్ కోహ్లీ (54 బంతుల్లో 73 నాటౌట్, 7 ఫోర్లు, 1 సిక్స్), దేవ్‌దత్ పడిక్కల్ (35 బంతుల్లో 61, 5 ఫోర్లు, 4 సిక్సర్లు) అర్ధ శతకాలతో మెరవడంతో లక్ష్యాన్ని బెంగళూరు 18.5 ఓవర్లలో పూర్తిచేసింది.

కింగ్స్ కట్టడి

ఓపెనర్లు ప్రభ్‌సిమ్రన్, ప్రియాన్ష్ (22) మెరుపులతో పంజాబ్ ఇన్నింగ్స్ దూకుడుగానే మొదలైంది. దయాల్ రెండో ఓవర్లో బౌండరీతో ప్రభ్‌సిమ్రన్ బాదుడుకు శ్రీకారం చుడితే అదే ఓవర్లో ప్రియాన్ష్ 6, 4 బాదాడు. భువీ మూడో ఓవర్లో ప్రభ్‌సిమ్రన్.. మూడు బౌండరీలు సాధించాడు. ప్రియాన్ష్ వికెట్ కోల్పోయినా పవర్‌ప్లేలో ఆ జట్టు 6 ఓవర్లకు 62/1తో పటిష్టంగానే ఉంది. కానీ స్పిన్నర్ల రాకతో పంజాబ్ కష్టాలు మొదలయ్యాయి. కృనాల్.. కింగ్స్‌కు వరుస షాకులిచ్చాడు. తొలుత ప్రభ్‌సిమ్రన్‌ను బోల్తా కొట్టించిన అతడు.. షెఫర్డ్ వేసిన 8 ఓవర్లో శ్రేయస్ అయ్యర్ (6) ఇచ్చిన క్యాచ్‌ను లాంగాన్ వద్ద అందుకున్నాడు. సుయాశ్.. 14వ ఓవర్లో ఆతిథ్య జట్టుకు డబుల్ షాకులిచ్చాడు. ఇంగ్లిస్(29)తో పాటు స్టోయినిస్ (1)నూ క్లీన్‌బౌల్డ్ చేసి పంజాబ్‌ను కోలుకోనీయకుండా చేశాడు.

కోహ్లీ, పడిక్కల్ షో

అర్ష్‌దీప్ తొలి ఓవర్లోనే సాల్ట్ (1) వికెట్ కోల్పోయిన ప్పటికీ కోహ్లీ, పడిక్కల్ పంజాబ్‌కు ఎలాంటి అవకాశమూ ఇవ్వకుండా పనిపూర్తిచేశారు. బార్ట్‌లెట్ బౌలింగ్‌లో 6,4 బాదిన పడిక్కల్ 30 బంతుల్లోనే అర్ధ శతకాన్ని పూర్తిచేశాడు. ఫిఫ్టీ తర్వాత అతడు.. స్టోయినిస్ బౌలింగ్‌లో మరో సిక్స్, ఫోర్ కొట్టడంతో ఆర్‌సీబీ స్కోరు 100 పరుగుల మార్కు ను దాటింది. దూకుడుగా ఆడే క్రమంలో అతడు నిష్క్రమించినా అప్పటికే క్రీజులో కుదురుకున్న కోహ్లీ.. గెలుపు బాధ్యతలను భుజానికేసుకున్నాడు. యాన్సన్ 15వ ఓవర్లో సింగిల్‌తో కోహ్లీ ఈ సీజన్‌లో నాలుగో అర్ధశతకాన్ని నమోదుచేశాడు. చాహల్ ఓవర్లో కోహ్లీ 6, 4 బాదగా 19వ ఓవర్లో జితేశ్ సిక్సర్‌తో మ్యాచ్‌ను ముగించాడు.

కోహ్లీ (73*)

సంక్షిప్త స్కోర్లు:
పంజాబ్: 20 ఓవర్లలో 157/6 (ప్రభ్‌సిమ్రన్ 33, శశాంక్ 31*, కృనాల్ 2/25, సుయాశ్ 2/26);
బెంగళూరు: 18.5 ఓవర్లలో 159/3 (కోహ్లీ 73*, పడిక్కల్ 61, అర్ష్‌దీప్ 1/26, బ్రర్ 1/27)

పాయింట్ల పట్టిక

జ	మ్యా	గె	ఓ	పా	ర.రే
గుజరాత్	7	5	2	10	0.98
ఢిల్లీ	7	5	2	10	0.58
బెంగళూరు	8	5	3	10	0.47
పంజాబ్	8	5	3	10	0.17
లక్నో	8	5	3	10	0.08
ముంబై	8	4	4	8	0.48
కోల్‌కతా	7	3	4	6	0.54
రాజస్థాన్	8	2	6	4	-0.63
హైదరాబాద్	7	2	5	4	-1.21
చెన్నై	8	2	6	4	-1.39

నోట్: జ- జట్టు, మ్యా. మ్యాచ్, గె-గెలుపు, ఓ-ఓటమి, పా-పాయింట్లు, ర.రే-రన్‌రేట్

కోహ్లీ ఖాతాలో మరో రికార్డు

ఐపీఎల్‌లో కోహ్లీ మరో రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. పంజాబ్ మ్యాచ్‌లో హాఫ్ సెంచరీ కోహ్లీకి ఈ ఫిఫ్టీ 67వది. దీంతో అతడు.. ఈ లీగ్‌లో అత్యధిక అర్ధ శతకాలు సాధించిన డేవిడ్ వార్నర్ (66) రికార్డును అధిగమించాడు.

అజార్ అసంతృప్తి

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ఉప్పల్ స్టేడియంలో నార్త్ స్టాండ్‌కు తన పేరును తొలగించడంపై భారత క్రికెట్ జట్టు మాజీ సారథి అజారుద్దీన్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన బంజారాహిల్స్‌లోని తన నివాసంలో మాట్లాడుతూ.. తాను భారత జట్టుకు సారథిగా పదేండ్లు, 19 ఏండ్ల పాటు జాతీయ జట్టుకు సేవలందించాలనని అన్నారు. కొంతమంది కావాలని రాజకీయం చేసి లార్డ్స్ క్రికెట్ క్లబ్‌తో కోర్టులో పిటిషన్లు వేయించారని చెప్పారు. ఒక హైదరాబాదీగా దేశం గర్వించే స్థాయిలో తాను ఎదిగానని.. కానీ కొంతమంది చేస్తున్న కుట్రలను న్యాయపరంగా ఎదుర్కొంటానని తెలిపారు. దేశ న్యాయవ్యవస్థపై తనకు పూర్తి నమ్మకముందని ఆయన చెప్పారు. హెచ్‌సీఏలో సైతం ఎన్నో విభేదాలున్నాయని అజారుద్దీన్ అన్నారు.

నాగపురి రమేశ్‌పై సస్పెన్షన్ వేటు

డోప్ టెస్టులలో ఇద్దరు అథ్లెట్లకు సహకరించారనే ఆరోపణలు ● రమేశ్‌తో పాటు మరో ఇద్దరు కోచ్‌లపైనా నిషేధం ● ఏడుగురు అథ్లెట్లకు షాక్

ఢిల్లీ: భారత అథ్లెటిక్స్‌లో మరో కుదుపు. ద్రోణాచార్య అవార్డు గ్రహీత, నేషనల్ జూనియర్ అథ్లెటిక్స్ చీఫ్ కోచ్‌గా వ్యవహరిస్తున్న నాగపూరి రమేశ్‌పై నేషనల్ యాంటీ డోపింగ్ ఏజెన్సీ (నాడా) సస్పెన్షన్ వేటు వేసింది. రమేశ్ దగ్గర శిక్షణ తీసుకున్న ఇద్దరు అథ్లెట్లు డోప్ టెస్టుకు నిరాకరించారనీ, ఆ విషయంలో ఆయన హస్తముందన్న ఆరోపణలతో నాడా నాగపురిపై తాత్కాలిక నిషేధం విధించింది. రమేశ్‌తో పాటు మరో ఇద్దరు కోచ్‌లు కరమ్‌వీర్ సింగ్, రాకేశ్ సైతం సస్పెన్షన్‌కు గురయ్యారు. కోచ్‌లే గాక ఏడుగురు అథ్లెట్లపైనా నాడా కొరడా ఝుళిపించింది. డోప్ టెస్టులను దాటవేసినందుకు గాను పరాస్ సింఘాల్, పూజా రాణి, నలబోతు షణ్ముగ శ్రీనివాస్, చెల్మి ప్రత్యూష, శుభమ్ మహర, కిరణ్, జ్యోతి పైనా వేటు పడింది. తెలుగు రాష్ట్రాల్లో దీప్తి జివాంజి, ద్యుతి చంద్, నందిని వంటి మట్టిలో మాణిక్యాలను వెలికితీసి వారిని అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దిన రమేశ్.. హైదరాబాద్‌లోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (శాయ్) నుంచి 2023లో జాతీయ జూనియర్ అథ్లెటిక్స్ కోచ్‌గా వెళ్లారు. వరంగల్ జిల్లాకు చెందిన ఆయన.. తెలుగు రాష్ట్రాల నుంచి ద్రోణాచార్య అవార్డు (2016లో) పొందిన తొలి కోచ్‌గా గుర్తింపు పొందారు. సుమారు రెండున్నర దశాబ్దాలుగా ఆయన కోచింగ్ బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. హైదరాబాద్‌కు చెందిన ఇద్దరు అథ్లెట్ల డోప్ టెస్టుల విషయంలో రమేశ్ వారికి సహకరించారని, వారినుంచి శాంపిల్స్ తీసుకోకుండా దాటవేయడంలో ఆయన పాత్ర ఉందని ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో 2021, నాడా యాంటీ డోపింగ్ రూల్స్‌లోని ఆర్టికల్ 2.9 ప్రకారం రమేశ్ సస్పెన్షన్‌కు గురయ్యారు. ఒక కోచ్‌పై సస్పెన్షన్ వేటు పడటం ఇదే మొదటి సారి కాదు. 2022లో ముంబైకి చెందిన అథ్లెటిక్స్ కోచ్ మిక్కీ మెనెజెస్.. తన ట్రైనీ కృతికి నిషేధిత ఉత్ప్రేరకాలు ఇచ్చినందుకు గాను అతడిపై రెండేండ్ల నిషేధం పడింది. అయితే రమేశ్‌పై వేటు వేసిన నాడా.. అది ఎంతకాలం అనేదానిపై మాత్రం స్పష్టతనివ్వలేదు.

నేను ఏ తప్పూ చేయలేదు: రమేశ్

'నేనెప్పుడూ తప్పుడు పనులు చేయలేదు. చేసినవారినీ ప్రోత్సహించలేదు. ఇరు తెలుగు రాష్ట్రాల్లోని ప్రతిభావంతులైన పేద క్రీడాకారులను వెలికితీసేందుకు నా జీవితాన్ని ధారపోశా. ఈ విషయం (నాడా సస్పెన్షన్)లో నేను ఎలాంటి విచారణకైనా సిద్ధం.'

పరేషాన్‌లో పరిశోధన!

- ప్రైవేటు చేతుల్లోకి పరిశోధన బాధ్యతలు
- ప్రత్యామ్నాయంపై వర్సిటీల అన్వేషణ
- ప్రైవేటు కళాశాలల ప్రొఫెసర్లకు ఎర
- ఐఐటీ, 'సెంట్రల్' ప్రొఫెసర్ల గైడెన్స్
- ఏటా 2 సార్లు పీహెచ్‌డీ నోటిఫికేషన్లు
- కొత్తపంథాకు జేఎన్‌టీయూ శ్రీకారం
- ప్రమాదమని సీనియర్ ప్రొఫెసర్ల హెచ్చరిక

హైదరాబాద్, ఏప్రిల్ 20 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని యూనివర్సిటీలలో ప్రొఫెసర్ల కొరత పరిశోధన విద్యపై ప్రభావం చూపుతున్నది. తగినంత మంది ప్రొఫెసర్లు లేక పరిశోధనలకు గైడెన్స్ కరువైంది. ఫలితంగా అసలు పరిశోధనలే మూలనపడ్డాయి. ఇప్పుడు ఇదే సాకుతో ఉస్మానియా, జేఎన్‌టీయూ వంటి కొన్ని యూనివర్సిటీలు ప్రైవేటు పరిశోధనలపై మొగ్గు చూపుతున్నాయి. పరిశోధనల కోసం ప్రైవేటు కాలేజీలలో ఐఐటీ, ఎన్ఐటీలలో పీహెచ్‌డీలు పూర్తి చేసి, ప్రొఫెసర్లుగా పనిచేస్తున్న వారితో గైడెన్స్ పొందాలని చూస్తున్నాయి. ఈ మేరకు సర్కారీ వర్సిటీల పరిశోధన బాధ్యతలు ప్రైవేటు కాలేజీ ప్రొఫెసర్ల చేతుల్లో పెట్టబోతున్నారు. ఈ మేరకు ప్రైవేటు అఫిలియేషన్ ఇంజినీరింగ్ కాలేజీ ప్రొఫెసర్లతో జేఎన్‌టీయూ అధికారులు సంప్రదింపులు జరుపుతున్నారు.

దీంతో భవిష్యత్తులో ప్రమాదం నెలకొనే అవకాశం ఉన్నదని సీనియర్ ప్రొఫెసర్లు హెచ్చరిస్తున్నారు. జేఎన్‌టీయూ సహా కొన్ని వర్సిటీలు తమ విద్యార్థుల పరిశోధన బాధ్యతలను ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలల ప్రొఫెసర్ల చేతుల్లో పెట్టాలని భావిస్తున్నాయి. ఇప్పటికే ప్రైవేటు అఫిలియేషన్ కాలేజీలు, ప్రైవేటు వర్సిటీలతో ప్రభుత్వ యూనివర్సిటీలు విలవిల్లాడుతున్నాయి. ఇలాంటి స్థితిలో యూనివర్సిటీల్లో జరగాల్సిన పరిశోధనలు కూడా ప్రైవేటుబాట పడితే ఎలా అన్న ఆందోళన వ్యక్తమవుతున్నది. ఈ విషయంలో జేఎన్‌టీయూ ఒక అడుగు ముందుకేసి కొత్త పంథాను అవలంబిస్తున్నది. ప్రైవేటు అఫిలియేషన్ ఇంజినీరింగ్ కాలేజీల ప్రొఫెసర్లతో సంప్రదింపులకు ఇప్పటికే శ్రీకారం చుట్టింది.

ప్రైవేటు కాలేజీ ప్రొఫెసర్ల ఎంగేజ్

ప్రొఫెసర్ పోస్టులు ఇప్పట్లో భర్తీకావని భావించిన జేఎన్‌టీయూ.. పరిశోధన విద్యపై ముందుకే సాగాలని నిర్ణయించుకున్నట్టు తెలుస్తున్నది. ఆ వర్సిటీలో పరిశోధన విద్యార్థులకు అనుగుణంగా, గైడెన్స్ ఇచ్చే సీనియర్ ప్రొఫెసర్లు, అధ్యాపకులు తగ్గిపోయారు. దీని కోసం ప్రైవేటు అఫిలియేషన్ ఇంజినీరింగ్ కాలేజీలపై ఆధారపడుతున్నారు. ఐఐటీ, ఎన్ఐటీ, సెంట్రల్ యూనివర్సిటీలలో పీహెచ్‌డీలు పూర్తిచేసి, ప్రస్తుతం ప్రైవేటు అఫిలియేషన్ ఇంజినీరింగ్ కాలేజీలలో ప్రొఫెసర్లుగా పనిచేస్తున్న వారి సహాయం పొందబోతున్నారు. వారిచ్చే అంగీకారం ప్రకారం జేఎన్‌టీయూలో పీహెచ్‌డీ సీట్లను పెంచుకోవాలని ఆ యూనివర్సిటీ యాజమాన్యం భావించిందని ఆ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ వెంకటేశ్వర్లు వెల్లడించారు. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత ఏర్పడే ఖాళీల ఆధారంగా ప్రతి ఆరు నెలలకు ఒకసారి విడుదలయ్యే పీహెచ్‌డీ నోటిఫికేషన్‌లో కనీసం 150 సీట్లకు తగ్గకుండా నోటిఫికేషన్ విడుదల చేయాలన్న ఆలోచనలో తామున్నామని డాక్టర్ వెంకటేశ్వర్లు వెల్లడించారు.

2,060కి పైగా పోస్టులు ఖాళీ

రాష్ట్రంలో 12 వర్సిటీలలో 2,060కి పైగా ప్రొఫెసర్లతోపాటు అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కొన్ని వర్సిటీలలో అసలు ప్రొఫెసర్లే లేకపోవడం గమనార్హం. వర్సిటీలలో ప్రొఫెసర్ల కొరత చాలా తీవ్రంగా ఉన్నదని తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి తెలిపారు. కొన్ని వర్సిటీలు పరిశోధన విద్యార్థుల కోసం ప్రైవేటు కాలేజీల ప్రొఫెసర్లను ఆశ్రయిస్తున్నాయని, సొంత వర్సిటీలలో మానవ వనరులను పెంచుకోవడమే ఉత్తమమని పేర్కొన్నారు. ప్రైవేటు కాలేజీలపై ఆధారపడితే ముమ్ముందు చెడు ప్రభావం పడే అవకాశాలు ఉన్నాయని హెచ్చరించారు.

తెలంగాణ సంస్థలకు ఏపీ చైర్మన్లు!

- పోలీస్ కంప్లైంట్స్ అథారిటీ చైర్మన్ స్వస్థలం అమలాపురం
- పీసీబీ అప్పిలేట్ అథారిటీ చైర్మన్ స్వస్థలం రామచంద్రపురం
- మానవ హక్కుల కమిషన్ సభ్యుడిగా ఏపీ మాజీ ఐఏఎస్
- బాబు కనుసన్నల్లోనే రేవంత్ సర్కారు నియామకాలు?

హైదరాబాద్, ఏప్రిల్ 20 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పాలనతో ఏపీ రిటైర్డ్ న్యాయమూర్తులు, బ్యూరోక్రాట్లకు తెలంగాణ రాష్ట్రం ఓ పునరావాస కేంద్రంగా మారిందా? తెలంగాణలో తెలివిగలవారే లేరన్నట్టు రాష్ట్రంలోని కీలక సంస్థల బాధ్యతలను ఏపీ మూలాలున్న వారికే కట్టబెడుతున్నారా? ఏపీకి చెందిన ఓ 'ముఖ్య' వ్యక్తి కనుసన్నల్లో వారికి తెలంగాణలో ఏదో విధంగా ఆశ్రయం కల్పిస్తున్నారా? అంటే అవుననే సమాధానమే వినిపిస్తున్నది. తెలంగాణలోని కీలక పదవులకు, ప్రభావవంతమైన సంస్థలకు ఆంధ్రప్రదేశ్ మూలాలున్న వ్యక్తులను నియమించడం ఈమధ్య పరిపాటిగా మారింది. ఏపీ మూలాలున్న ఆదిత్యనాథ్‌దాస్‌ను తెలంగాణ నీటిపారుదల శాఖ సలహాదారుగా నియమించడంపై ఇప్పటికే పెద్ద దుమారం రేగింది. త్వరలో రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (రెరా) ట్రిబ్యునల్ చైర్మన్ పదవిని కూడా ఏపీకి చెందిన వ్యక్తికే కట్టబెట్టే అవకాశం ఉన్నట్టు విశ్వసనీయ సమాచారం. తెలంగాణ ఆర్టీఐ కమిషనర్‌గా కూడా ఏపీ ప్రభుత్వంలో కీలక బాధ్యతలు వహించిన మరో వ్యక్తిని నియమించాలన్న ఆలోచనలో ఉన్నట్టు తెలిసింది.

పోలీస్ కంప్లైట్స్ అథారిటీ చైర్మన్‌గా ఏపీ వ్యక్తి

ఇటీవల రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రాష్ట్ర, జిల్లా పోలీస్ కంప్లైంట్ అథారిటీ చైర్మన్‌గా ఏపీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి డాక్టర్ శివశంకర్‌రావును నియమించింది. ఆయన స్వస్థలం తూర్పుగోదావరి జిల్లా అమలాపురం మండలంలోని సాకుర్రు గ్రామం. వ్యవసాయ కుటుంబానికి చెందిన ఆయన న్యాయశాస్త్రాన్ని అభ్యసించారు. వాణిజ్యశాస్త్రంలో మాస్టర్స్ డిగ్రీ, కాకతీయ విశ్వవిద్యాలయం నుండి న్యాయశాస్త్రంలో మాస్టర్స్ డిగ్రీ, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి న్యాయశాస్త్రంలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు హైదరాబాద్‌లోని హైకోర్టు ఆఫ్ జ్యుడీషియేచర్ న్యాయమూర్తిగా నియమితులయ్యారు. డాక్టర్ శివశంకర్‌రావును కాకుండా రాష్ట్ర, జిల్లా పోలీస్ కంప్లైంట్ అథారిటీ చైర్మన్‌గా నియమించేందుకు తెలంగాణ మూలాలున్న రిటైర్డ్ జడ్జి ఎవరూ లేరా? అనే ప్రశ్న గట్టిగా వినిపిస్తున్నది.

పీసీబీ అప్పిలేట్ అథారిటీ చైర్మన్‌గానూ..

రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) అప్పిలేట్ అథారిటీ చైర్మన్‌గా ఏపీకి చెందిన జస్టిస్ సాంబశివరావును నియమించారు. తూర్పు గోదావరి జిల్లాలోని రామచంద్రపురానికి చెందిన ఆయన తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తిగా సేవలందించినప్పటికీ ఏపీ మూలాలు ఉండటం వివాదాస్పదంగా మారింది. తెలంగాణలో రిటైర్డ్ జడ్జీలు చాలా మందిఉన్నందున వారిలో ఒకరిని పీసీబీ అప్పిలేట్ అథారిటీ చైర్మన్‌గా నియమిస్తే బాగుండేదని మేధావులు వ్యాఖ్యానిస్తున్నారు. కాగా, ఈ అథారిటీలో మరో ఇద్దరు సభ్యులను నియమించాల్సి ఉండగా.. ఓ సభ్యుడి విషయంలో వివాదం తలెత్తి, దాదాపు నెల రోజుల నుంచి ప్రతిష్టంభన కొనసాగుతున్నది. దీంతో పీసీబీ అప్పిలేట్ అథారిటీ నియామక ఉత్తర్వులు నిలిచిపోయాయి.

మానవ సమస్యలపై స్పందించేవారే లేరా?

తెలంగాణలో మానవీయ దృక్పథం ఉన్నవారు, ప్రజా సమస్యలను పరిష్కరించేవారే లేరన్నట్టు ఇటీవల రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ సభ్యుడి నియామకం జరిగింది. ఆ పదవిలో ఆంధ్రా మూలాలున్న రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డాక్టర్ బీ కిశోర్‌ను నియమించారు. ఎమ్మెస్సీ అగ్రికల్చర్, ఎల్ఎల్‌బీ చేసిన ఆయన ఐఏఎస్‌గా పలు విభాగాలతోపాటు టీటీడీలో ఎక్స్ అఫిషియో సభ్యుడిగా ఏపీకి సేవలందించారు. సాధారణంగా మానవ హక్కుల కమిషన్ సభ్యుడి పోస్టును సామాజిక కార్యకర్తలకు ఇస్తారు. బ్యూరోక్రాట్లకు ఇవ్వడం చాలా అరుదు. కానీ, తెలంగాణలో మానవ హక్కులు, సమస్యలపై స్థానికులెవరికీ అవగాహన లేదన్నట్టు డాక్టర్ కిశోర్‌ను నియమించడం వివాదాస్పదంగా మారింది.

సిఫారసు లేఖలు టీటీడీ తిరస్కరణ!

సమాచారం తెలియక భక్తుల ఇబ్బందులు

హైదరాబాద్, ఏప్రిల్ 20 (నమస్తే తెలంగాణ): తిరుమలలో భక్తుల రద్దీ దృష్ట్యా ప్రజాప్రతినిధులు, ఐఏఎస్, ఐపీఎస్, ఇతర ప్రభుత్వ విభాగాల సిఫారసు లేఖలను టీటీడీ తిరస్కరిస్తున్నట్టు సమాచారం. ఈ విషయంపై టీటీడీ ఎలాంటి స్పష్టత ఇవ్వకపోవడంతో భక్తులు కుటుంబసమేతంగా సిఫారసు లేఖలతో వచ్చి.. తీరా లేఖలు స్వీకరించడం లేదని తెలిసి ఇబ్బంది పడుతున్నారు. భక్తుల రద్దీ కారణంగా ఏటా ఏప్రిల్ 15నుంచి మూడునెలలపాటు సిఫారసు లేఖలను స్వీకరించరు. స్వయంగా వచ్చే వీఐపీ ప్రొటోకాల్ పరిధిలోని భక్తులకు మాత్రమే బ్రేక్ కల్పిస్తారు. ఈ క్రమంలోనే సిఫారసు లేఖలు తిరస్కరిస్తున్నట్టు తెలుస్తోంది. దీనిపై అధికారులు అధికారిక సమాచారాన్ని విడుదల చేయాలని భక్తులు కోరుతున్నారు.

హుండీ ఆదాయం రూ.3.36కోట్లు

తిరుమలలో శ్రీవారి సర్వదర్శనానికి 18గంటల సమయం పడుతున్నది. శనివారం శ్రీవారిని 78,821 మంది భక్తులు దర్శించుకున్నారు. శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.36 కోట్లు వచ్చినట్టు టీటీడీ అధికారులు వెల్లడించారు.

రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఎప్పుడిస్తరు?

- పెన్షనర్ల సమస్యలు సర్కార్‌కు పట్టవా?
- ఏప్రిల్ 1న ఇస్తామన్న రూ.500 కోట్లు.. 20వ తేదీ దాటినా ఎందుకు ఇవ్వలేదు?
- మాసొమ్ములు మాకివ్వని దౌర్భాగ్యమేల?
- ప్రభుత్వంపై పెన్షనర్స్ జేఏసీ మండిపాటు
- మే 8 నుంచి కార్యాచరణ: జేఏసీ ప్రకటన

పెన్షనర్స్ జేఏసీ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న జేఏసీ చైర్మన్ కే లక్ష్మయ్య

హైదరాబాద్, ఏప్రిల్ 20 (నమస్తే తెలంగాణ): 'రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెండింగ్ డీఏలు, డీఆర్‌లు ఇవ్వకుండా ఎన్నాళ్లు కాలయాపన చేస్తారు? పెన్షనర్లపై ఇదే నిర్లక్ష్య వైఖరిని ప్